క్లుప్తంగా

భ్రమరాంబాదేవికి ఊయలసేవ



అమ్మవారికి ఊయలసేవ నిర్వహిస్తున్న ఆలయ అధికారి, అర్చకులు

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శుక్రవారం ఊయలసేవ నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు ప్రారంభమైన సేవలో భాగంగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు ముందుగా సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి పూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. శ్రీశైలగ్రామ దేవత అంకాళమ్మకు విశేష పూజలు నిర్వహించారు.

కుమారస్వామికి షష్టి పూజలు



కుమారస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో శుక్రవారం షష్టిని పురస్కరించుకుని ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్ర పారాయణలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

మహానందీశ్వర దంపతులకు పల్లకీసేవ



మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: మహానందీశ్వర దంపతులకు శుక్రవారం రాత్రి పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ పి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు అలంకార మండపంలో మహానందీశ్వర స్వామి ఉత్సవ మూర్తులను అలంకరించారు. గణపతి పూజ, అలంకార హారతులు ఇచ్చి స్వామి, అమ్మవార్లను పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారాల్లో స్వామివార్ల ఉత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు.

ఆత్మకూరులో భారీ వర్షం

ఆత్మకూరు: పట్టణంలో శుక్రవారం వేకువజామున భారీ వర్షం కురిసింది. దీంతో భవనాశి, సుద్దవాగులు పొంగి ప్రవహించాయి. సిద్ధాపురం చెరువు నిండి అలుగు ఎక్కి పారడంతో శ్రీశైలం, ఆత్మకూరు రహదారులపై వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు.

ఆర్టీసీ డిపో ఏర్పాటు చేయాలి

శ్రీశైలంప్రాజెక్ట్: మండల కేంద్రం సున్నిపెంటలో ఆర్టీసీ బస్ డిపో ఏర్పాటు చేయాలని ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూలం నాగరాజుకు శుక్రవారం ఏఐవైఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఎన్నో ఏళ్లుగా సున్నిపెంటలో డిపో ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉందని, ఇప్పటికైనా అమలు చేసి మండల ప్రజల కోరిక నెరవేర్చాలని వారు చైర్మన్‌ను కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో నాయకులు కె.మహేష్, కె.ప్రవీణ్ కుమార్, విజయకుమార్, శివశంకర్ తదితరులు ఉన్నారు.

కనులపండువగా స్వాతి వేడుకలు

బేతంచెర్ల: మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో భాద్రపద మాసం పురస్కరించుకుని స్వామివారి జన్మ నక్షత్రమైన స్వాతి వేడుకలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేతుడైన మద్దిలేటి నరసింహస్వామికి సుప్రభాత సేవ, విశ్వక్సేనారాధన, వాసుదేవ పుణ్యాహవచనం, సుదర్శన హోమం, నవ కలశస్నపనం, నరసింహహోమం, తిరుమంజనం, ధన్వంతరి మూల మంత్ర జపం చేశారు. అనంతరం సహస్ర దీపాలంకరణ సేవ కనులపండువగా నిర్వహించారు. ఆ తర్వాత స్వామివారి ఊరేగింపు జరిగింది. ఆలయ ఈఓ రామాంజనేయులు పర్యవేక్షించారు.

చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న దాత

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధి కోసం ఇదే గ్రామానికి చెందిన కీశేలు పీఆర్ ఓబులరెడ్డి జ్ఞాపకార్థం ఆయన సతీమణి పీఆర్ ప్రభావతి కుటుంబ సభ్యులు రూ.1,01,116 విరాళం అందజేశారు. ఈ విషయాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి శుక్రవారం వెల్లడించారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులను పూలమాలలతో సన్మానించి, ఆలయ అర్చకులు అమ్మవారి ప్రసాదం అందజేశారు.





ఆత్మకూరులో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు, ఆర్యవైశ్య సోదరులు, గణనాథుల శోభాయాత్ర



పగిడ్యాలలో విగ్రహాన్ని ఊరేగింపుతో పాల్గొన్న సీఐ సుబ్రహ్మణ్యం



తూడిచెర్లలో వినాయకులను నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు

వినాయకా..వీడ్కోలిక!

ఆది దేవుడు వినాయకుడికి భక్తులు శుక్రవారం వీడ్కోలు పలికారు. మూడు రోజుల పాటు భక్తిశ్రద్ధతో పూజలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో సంబరాలు చేసుకున్నారు. చివరిరోజు ప్రతిపల్లెలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. భక్తిభావంతో పూజలు నిర్వహించి, అన్నదానాలు నిర్వహించారు. యువత రంగులు పూసుకుని, వినాయకుడి చిత్రాలున్న టీషర్ట్స్ ధరించి, తలకు ఆరెంజ్ రిబ్బన్లు కట్టుకుని గణనాథుడి ఊరేగింపుల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. శివపార్వతుల తనయుడి శోభాయాత్రలతో శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల్లోని గ్రామాలు శోభాయమానంగా వెలుగొందాయి. యువత కేరింతలు, నృత్యాలు, వివిధ వేషధారణలతో అలరించగా పెద్దలు బోలో గణేష్ మహారాజ్‌కీ – జై అంటూ నినదించారు.గ్రామాల చివరనున్న చెరువులు, కాలువల్లో వినాయకుడిని నిమజ్జనం చేసి ఘనంగా వీడ్కోలు పలికారు. – సాక్షి నెట్‌వర్క్



పాములపాడులో నిమజ్జనానికి తరలుతూ..



యువకుల ఆనందోత్సాహాలు



కోలాటం వేస్తున్న చిన్నారులు



బండిఆత్మకూరులో గణనాథుల ఊరేగింపు

ఆత్మకూరు: పట్టణంలో కొలువుదీరిన గణనాథులను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు నరహరి సత్యనారాయణ, డీఎస్పీ రామాంజినాయక్, ఆర్డీఓ నాగజ్యోతి, తహసీల్దార్ రత్నరాధిక, కమిషనర్ రమేష్‌బాబు, సీఐ రాము ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని మెయిన్‌బజారు, గాంధీచౌక్, తోటగేరి, అర్బన్‌పేట, గొల్లపేట, వెంగళరెడ్డినగర్, పాత నవాజ్ ఏరియా, గరీబ్‌నగర్, ఏకలవ్యనగర్ తదితర కాలనీల నుంచి దాదాపు 55 విగ్రహాలు ఊరేగింపుగా ఎస్‌ఆర్‌ఎంసీ కెనాల్ వద్దకు చేరుకున్నాయి. భారీగా తరలివచ్చిన భక్తజనం మధ్య వినాయకులను నిమజ్జనం చేశారు. శోభాయాత్రలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు.

- ఆత్మకూరు పట్టణంలోని తోటగేరి వినాయకుడి లడ్డూ రూ.61 వేలు పలికింది. ఎస్‌ఆర్‌ఎంసీ కెనాల్ వద్ద కొనసాగించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ వేడుకల్లో పాల్గొని గణనాథులకు వీడ్కోలు పలికారు.



ఆత్మకూరులో నిమజ్జనానికి తరలుతున్న పార్వతీ పుత్రుడు

- ఆత్మకూరు మండలంలోని కరివేన, నల్లకాల్వ, వడ్ల రామాపురం, కురుకుంద, కృష్ణాపురం, వెంకటాపురం, సిద్ధాపురం, ముష్టపల్లి, సిద్దపల్లి గ్రామాల్లో కొలువుదీరిన వినాయక విగ్రహాల నిమజ్జనం ప్రశాంతంగా ముగిసింది.
- **కొత్తపల్లి:** గణేషుడు గంగ ఒడికి చేరాడు. మూడురోజుల పాటు విశేష పూజలందుకున్న వినాయక విగ్రహాలను శుక్రవారం మండల ప్రజలు భాజాభజంత్రీల మధ్య నిమజ్జనానికి తరలించారు. చెరువులు, బావులు, కాల్వలతోపాటు సంగమేశ్వరం వద్ద ఉన్న కృష్ణా జలాల్లో నిమజ్జన చేశారురు.
- **నందికొట్కూరు:** బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్ పరిధిలోని-53 విగ్రహాలు, నందికొట్కూరు పోలీసు స్టేషన్ పరిధిలోని-85, మిడుతూరు మండలంలో-53 వినాయక విగ్రహాలను ఆయా గ్రామాల పరిధిలోని కేసీ కెనాల్ వద్ద నిమజ్జనం చేశారు. రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.
- **పాములపాడు:** గణనాథుడి శోభాయాత్రలో చిన్నారుల కోలాటం ఆకట్టుకుంది. యువత నృత్యాలతో కేరింతలు కొట్టారు. విగ్రహాలను ఎస్‌ఆర్‌ఎంసీ, జీఎన్‌ఎస్‌ఎస్, కేసీ కాల్వల్లో నిమజ్జనం చేశారు.
- **జూపాడుబంగ్లా:** మూడురోజుల పాటు పూజలందుకున్న బొజ్జ గణపయ్య ప్రతిమలను శుక్రవారం కేసీ కాల్వలో నిమజ్జనం చేశారు. తాటిపాడు వీరభద్ర స్వామి ఆలయం వద్ద ఏర్పాటుచేసిన వినాయకుడి లడ్డూ రూ.32 వేలు పలికింది.

- **మహానంది:** గణేష్ నిమజ్జనం వేడుకలు వైభవంగా జరిగాయి. గాజులపల్లె, బుక్కాపురం, తిమ్మాపురం, అబ్బీపురం, బొల్లవరం, తమ్మడపల్లె, నందిపల్లె, తదితర గ్రామాల్లో పూజలందుకున్న గణేష్ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి మహానంది సమీపంలోని అయ్యన్ననగర్ వద్ద ఉన్న వినాయక ఘాట్‌లో నిమజ్జనం చేశారు.



నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథులు



కొత్తపల్లిలో వినాయకుడి శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



ఊరేగింపులో చిన్నారుల కోలాహలం



మిడుతూరులో గణేష్ విగ్రహాలు నిమజ్జనానికి తరలివెళ్తున్న భక్తులు



జూపాడుబంగ్లా కేసీ కాల్వ వద్ద నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న అధికారులు

అక్టోపస్ బృందంతో శ్రీశైల ఆలయ ఈఓ సమావేశం



అక్టోపస్ బృందంతో మాట్లాడుతున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో భద్రతాపరంగా చేపట్టాల్సిన చర్యల గురించి శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు అక్టోపస్ బృందంతో సమావేశమయ్యారు. శుక్రవారం దేవస్థాన పరిపాలన భవనంలోని ఈఓ చాంబర్‌లో నిర్వహించిన ఈ సమావేశంలో అక్టోపస్ డీఎస్పీ కె.సుంకురయ్య, శ్రీశైలం సీఐ జి.ప్రసాదరావు, దేవస్థాన సీఎస్ఓ ఎం.మల్లికార్జున పలువురు అక్టోపస్ బృందం సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈఓ ఆలయ వేళలు, భక్తులు దర్శనానికి వేచి ఉండే క్యూకాంప్లెక్స్‌లో చేయాల్సిన ఏర్పాట్లు, క్యూలైన్ల నిర్వహణ, రోజు వారీగా, ఉత్సవాల సమయాల్లో సగటున ఆలయాన్ని సందర్శించే భక్తుల సంఖ్య మొదలైన అంశాల గురించి వివరించారు. అనంతరం అక్టోపస్ డీఎస్పీ సుంకురయ్య .. భక్తుల భద్రతకు సంబంధించిన అంశాలు, అవాంఛనీయ ఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు ఇచ్చారు. శ్రీశైల ఆలయంలో ఊహించని విధంగా ఉగ్రవాదులు దాడులు నిర్వహిస్తే, ఏవిధంగా అడ్డుకోవాలనే విషయాలపై అక్టోపస్ బృందం శనివారం రాత్రి మాక్‌డ్రిల్ నిర్వహించనున్నట్లు దేవస్థాన అధికారులు తెలిపారు.

గణనాథుని శోభాయాత్రలో ఉద్రిక్తత

- నిలిచిపోయిన నిమజ్జనం



ఇరువర్గాలతో చర్చలు జరుపుతున్న అధికారులు



నిమజ్జనానికి నోచుకోని విగ్రహాలు

వెలుగోడు: పట్టణంలో గణేశ్ విగ్రహాల నిమజ్జనోత్సవంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. శుక్రవారం మధ్యాహ్నం నుంచి శోభాయాత్ర ప్రారంభం కాగా.. దళిత కాలనీలో చర్చి వద్ద డ్రమ్స్ కొట్టొద్దంటూ దళితులు అడ్డుతగిలారు. అయితే ఇందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఒప్పుకోకపోవడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. 4 గంటల సమయంలో ఈ యాత్ర నిలిచిపోగా పట్టణంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆత్మకూరు ఆర్‌డీవో నాగజ్యోతి, డీఎస్పీ రామాంజినాయక్, సీఐ సురేష్‌కుమార్‌రెడ్డిలు ఇరువర్గాలతో చర్చలు జరిపినా ససేమిరా అనడంతో టెన్షన్ వాతావరణం నెలకొంది. శుక్రవారం రాత్రి ఇరువర్గాల మధ్య తోపులాట జరగడంతో పోలీసులు లాఠీచార్జ్ చేయడంతో ఇరువురు మహిళలకు గాయాలయ్యాయి. ఈ నేపథ్యంలో ఉత్సవ కమిటీ సభ్యులు విగ్రహాలను రోడ్డుపైనే నిలిపేశారు. ట్రాక్టర్ ఇంజన్లను తీసుకెళ్లిపోవడంతో రాత్రి 11 గంటల సమయంలో నిమజ్జనం నిలిచిపోయింది. జిల్లా ఎస్పీ అదిరాజ్ సింగ్, జాయింట్ కలెక్టర్ జేసీ విష్ణు చరణ్, ఉన్నతాధికారులు ఇరువర్గాలను శాంతింపజేశారు. విగ్రహాలు నిమజ్జనానికి నోచుకోకపోవడంతో గ్రామంలో ఎప్పుడు ఏమి జరుగుతుందోననే ఆందోళన నెలకొంది.



సదానందాశ్రమం వద్ద గుంతలు పడిన ప్రధాన రహదారి

గుంతలు.. పాలకుల కళ్లకు గంతలు!

మహానంది: గుంతల్లేని రోడ్ల నిర్మాణమే తమ ప్రభుత్వ లక్ష్యమంటున్న అధికార పార్టీ నేతలకు గ్రామీణ రోడ్లపై మోకాల్లోతు గుంతలేర్పడినా కనిపించకపోవడం సిగ్గుచేటు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదికిపైగా అవుతున్నా పల్లె రోడ్లను పట్టించుకున్న పాపానపోలేదు. మండల కేంద్రం ఎం.తిమ్మాపురంలో ఎంపీడీఓ కార్యాలయం, జిల్లా పరిషత్ స్కూల్, మోడల్‌స్కూల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పోస్టాఫీసు, బ్యాంకులు ఉన్నాయి. అయితే బుక్కాపురం నుంచి తిమ్మాపురం మీదుగా ఉన్న రెండు కిలోమీటర్ల దారిలో అడుగడుగునా గుంతలే. వాహనదారులు, ప్రయాణికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నా పాలకుకులకు మాత్రం పట్టడం లేదు.

మధురమైనది తెలుగు భాష







వంటలను రుచి చూస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రదర్శిస్తున్న నృత్యాలు, తెలుగుభాష గొప్పతనాన్ని వివరిస్తున్న మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ రమేష్

మహానంది: తెలుగు భాష ఎంతో మధురమైనదని తిమ్మాపురం ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం, గిడుగు రామ్మూర్తి జయంతి, హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి, జాతీయ క్రీడ దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తెలుగు భాష ప్రపంచంలోనే గొప్ప స్థానంలో నిలిచిందని స్పష్టం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా జానపద నృత్య, ప్రదర్శనలు, కోలాటాలతో పాఠశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. సంప్రదాయ తెలుగు రుచుల పేరుతో విద్యార్థులకు వంటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.

- **జూపాడుబంగ్లా:** తెలుగుభాషా దినోత్సవాన్ని మండలంలోని మోడల్‌స్కూల్, గురుకుల పాఠశాల, తాటిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ముందుగా గిడుగు వెంకటరామ్మూర్తి చిత్రపటానికి పూలవేసి ఆయన తెలుగుభాష అభివృద్ధికి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. తెలుగు భాష కోసం శ్రీకృష్ణదేవరాయలు చేసిన సేవలను మోడల్‌స్కూల్ విద్యార్థులు అష్టదిగ్గజాల వేషధారణలో కొనియాడారు. అలాగే విద్యార్థినుల భరతనాట్యం అలరించింది. కార్యక్రమంలో మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ రమేష్, తాటిపాడు హెచ్‌ఎం దేవిడ్‌రవిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



తాటిపాడు ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న హెచ్‌ఎం దేవిడ్ రవిశేఖర్

- **నందికొట్కూరు:** తెలుగు భాష ఔన్నత్యాన్ని ఎలుగెత్తి చాటిన గొప్ప మహానుభావుడు గిడుగు రామ్మూర్తి అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.సునీత తెలిపారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా శుక్రవారం కళాశాలలో నిర్వహించిన గిడుగు రామ్మూర్తి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ రఘుపతిరెడ్డి, మహమ్మద్‌మియా, అన్వర్ హుసేన్ పాల్గొన్నారు.

- **శ్రీశైలంప్రాజెక్ట్:** శ్రీశైలంప్రాజెక్ట్ కాలనీలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని తెలుగు భాష గొప్పదనాన్ని ప్రిన్సిపాల్ ప్రకాష్ వివరించారు. అనంతరం తెలుగులో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.హుస్సేన్‌బాషా పాల్గొన్నారు.



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపాల్ ప్రకాష్

- **పాములపాడు:** స్థానిక ఏఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ తెలుగు బాషా, క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. తెలుగు భాషా పితామహుడు గిడుగు వెంకటరామమూర్తి, హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్‌ల జయంతుల సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు.





నీటమునిగి పాచిపోయిన మొక్కజొన్న పంటను చూపుతున్న రైతు శ్రీనివాసులు, దెబ్బతిన్న పత్తిపంటను పరిశీలిస్తున్న తరిగోపుల వీఏఏ సాగర్

అధిక వర్షం.. అతలాకుతలం

జూపాడుబంగ్లా: ఎడతెరపిలేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండల వ్యాప్తంగా 1,500 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు కాకిలేరు ఉప్పొంగి పారటంతో పాటు పి.లింగాపురంలో పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో కాల్వ దిగువన ఉన్న పి.లింగాపురం గ్రామంలోని పత్తి, మొక్కజొన్న, మినుము, ఉల్లి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు పెట్టుబడి పెట్టినట్లు రైతులు పేర్కొంటున్నారు. ఈ లెక్కన సుమారు రూ.6 కోట్ల నుంచి రూ.7 కోట్ల వరకు నష్టం చేకూరింది. వ్యవసాయ అధికారులు నష్టపోయిన పంటలను గుర్తించి పరిహారం కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపాలని రైతులు కోరుతున్నారు.